# ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



బోర్లం గురుకుల పాఠశాల వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

పెద్ద కొడప్‌గల్(పిట్లం), ఫిబ్రవరి 23 : పిట్లం మండలంలోని జ్యోతిబాపులే గురుకుల పాఠశాల, పెద్ద కొడప్‌గల్ మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురుకులాల ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష సమయం కంటే గంట ముందు విద్యార్థులు వచ్చి హాల్ టికెట్ నంబర్లు చూసుకొని పరీక్షా కేంద్రంలోకి వెళ్లారు. పిట్లం, పెద్ద కొడప్‌గల్‌లో ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు, విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించారు. పిట్లంలో ప్రవేశ పరీక్షకు 181 మంది విద్యార్థులకుగాను 179 మంది విద్యార్థులు హాజరు కాగ, ఇద్దరూ గైరాజరయ్యారు. పెద్దకొడప్‌గల్ ప్రవేశ పరీక్షా కేంద్రంలో 476 మంది విద్యార్థులకుగాను 472 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగ నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.

**బాన్సువాడ మండలంలో..**

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 23 : గురుకులాల ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని బోర్లం క్యాంపు గురుకులు పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. 955 మంది విద్యార్థులకుగాను 932 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 23 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు.

**ఎల్లారెడ్డిలో..**

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 23: ఎల్లారెడ్డి పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మోడల్‌స్కూల్, గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రంలోకి పది గంటల నుంచి విద్యార్థులను పంపాల్సి ఉండగా గిరిజన బాలికల పాఠశాలలో 10.15 గంటల వరకూ గేటు తెరవకపోవడం, విద్యార్థులను లోపలికి అనుమతించకపోవడంతో కాసేపు విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు.

**తాడ్వాయిలో..**

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 23: తాడ్వాయి మండల కేంద్రంలో నిర్వహించిన గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. ప్రవేశ పరీక్షలకు 597 మంది విద్యార్థులకుగాను 593 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరైనట్లు తెలిపారు.



ప్రవేశ పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

**దోమకొండలో..**

బీబీపేట(దోమకొండ), ఫిబ్రవరి 23 : దోమకొండలో నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షకు మొత్తం 899 మంది విద్యార్థులకుగాను 869 మంది హాజరుకాగా 30 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎలాంటి ఘటనలూ జరగాకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు



ప్రతిభా పరీక్ష రాస్తున్న పదోతరగతి విద్యార్థులు

కామారెడ్డి, ఫిబ్రవరి 23 : జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయవాది సిద్ధిరాములు, పట్టణ ఎస్సై బాల్‌రెడ్డి హాజరై ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న భయాందోళనలు తొలగిపోవడానికి ఈ పరీక్షలు ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అజయ్, కార్యదర్శి అరుణ్, నాయకులు రాహుల్, నితిన్, మణికంఠ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

కామారెడ్డి, ఫిబ్రవరి 23 : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశంలో ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తున్న ప్రజావాణిని రద్దు చేసినట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసన మండల ఎన్నికల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని సూచించారు. ప్రజల విజ్ఞాపనలు తీసుకోవడానికి కలెక్టరేట్‌లోని రూం నంబర్ 25లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలు, దరఖాస్తులు హెల్ప్‌డెస్క్‌లో అందజేయవచ్చని సూచించారు.

## రైలు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 23 : నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ సీహెచ్.సాగర్ ఇచ్చిన సమాచారం ప్రకారం.. అర్సపల్లి రైల్వే గేటుకు కొద్దిదూరంలో జాన్కంపేట్ రైల్వేస్టేషన్ మధ్య సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉన్న ఓ మహిళ గుర్తుతెలియని రైలు ప్రమాదంలో మరణించిన్నట్లు తెపారు. మహిళ వద్ద ఎటువంటి ఆధారాలూ లేకపోవడంతో కేసు నమోదు చేసి, మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మృతురాలి సంబంధీకులు రైల్వే ఎస్సై – 87126 58591 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## సంత్ గాడ్గే బాబా జయంతి

బిచ్కుంద, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో సంత్ గాడ్గే బాబా జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రజక సంఘ మండల అధ్యక్షుడు విఠల్ మాట్లాడుతూ.. చీపురుతో వీధులు, కీర్తనలతో మస్తిష్కాలను శుభ్రం చేసిన వాగ్గేయకారుడు సంత్ గాడ్గే బాబా అని అన్నారు. ఆయన చరిత్ర నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుకారాం, కాశీరాం, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్, ఫిబ్రవరి 23 : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతున్నదని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసిన డెబిట్, క్రెడిట్ కార్డులను అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చిందని ప్రాసెసింగ్ ఫీజ్ కోసం కొన్ని డబ్బులు పంపాలని అడుగుతారని, వారి మాటలు నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లోన్లు మంజూరయ్యాయని, వివిధ రకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతారని, వాటిని ఇన్‌స్టాల్ చేసి వివరాలను నమోదు చేస్తే మీ బ్యాంకు ఖాతాలోని డబ్బులు సైబర్ నేరాగాళ్ల బ్యాంకు ఖాతాలోకి వెళ్తాయని వివరించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాల బారినపడకుండా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

## 28 నుంచి నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

కామారెడ్డి, ఫిబ్రవరి 23 : కామారెడ్డి విద్యాశాఖలో డీఎస్సీ 2024 ద్వారా ఇటీవల నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు వృత్తి ప్రవేశ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈవో రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు కామారెడ్డిలో ఈ నెల 28, మార్చి 1, 3వ తేదీ, హైస్కూల్ ఉపాధ్యాయులకు నిజామాబాద్‌లో మార్చి 4, 5, 6వ తేదీల్లో, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు నిజామాబాద్‌లో మార్చి 10, 11, 12వ తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరుకావాలని తెలిపారు.

## దొంగకు దేహశుద్ధి : పోలీసులకు అప్పగింత

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 23 : జిల్లాకేంద్రంలో ఆదివారం సాయంత్రం ఓ ఇంట్లో చోరీకి పాల్పడుతున్న దొంగను పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. నగరంలోని శివాజీనగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లోకి చొరబడిన దుండగుడు సుమారు 15 తులాల విలువ చేసే వెండి వస్తువులతో పాటు కొంత నగదు దొంగిలించి పారిపోతుండగా ఇంట్లో వారు గుర్తించారు. అనంతరం స్థానికుల సహాయంతో సదరు దొంగను పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం రెండో టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## బాలుడి వైద్య ఖర్చులకు ఎమ్మెల్సీ కవిత సాయం



ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబీకులకు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కృష్ణ, నాయకులు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 23: బోధన్ పట్టణంలోని 12వ వార్డుకు చెందిన శ్రీకాంత్ విజయ దంపతుల మూడు నెలల బాలుడు కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా, నిజామాబాద్ మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేశారు. బాలుడికి శస్త్ర చికిత్స చేయించేందుకు ఆర్థికంగా సాయం అందించాలని, స్థానిక బీఆర్ఎస్ యువ నాయకుడు రామకృష్ణను బాలుని తండ్రి సంప్రదించగా, ఆయన ఈ విషయాన్ని ఎమ్మెల్సీకి వివరించారు. కాగా, సదరు బాలుడి చికిత్స కోసం ఎమ్మెల్సీ కవిత పంపిన రూ.25వేల ఆర్థిక సాయాన్ని పెరిక రామకృష్ణ బాలుడి తండ్రికి అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్సీకి బాలుడి తల్లిదండ్రులు శ్రీకాంత్ విజయ కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యను ఎమ్మెల్సీకి వివరించి, సాయానికి సహకరించిన పెరిక రామకృష్ణకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత



బీబీపేట బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బీబీపేట్, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2003–2004 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మండలంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన టాలెంట్ టెస్టులో 109 మంది పాల్గొన్నారు. ఈ టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

•ఆరునెలలుగా శుభ్రం చేయని మురికి కాలువలు • సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు •పట్టించుకోని అధికారులు



బిచ్కుంద మండల కేంద్రంలోని దత్తనగర్ కాలనీలో మురికి కాలువ శుభ్రం చేస్తున్న యువకుడు



7వ వార్డులోని మురికి కాలువలో పేరుకు పోయిన చెత్త

బిచ్కుంద, ఫిబ్రవరి 23: మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది. దీంతో ప్రజలు సమస్యల సుడిగుండంలో సతమతమవుతున్నారు. పల్లెల్లో మురుగు కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. మండల కేంద్రంలోని 7వ వార్డులో గడిచిన ఆరు నెలలనుంచి మురికి కాలువను శుభ్రం చేసే నాథుడే కరువయ్యాడు. మురికి కాలువలో చెత్త పేరుకుపోయి మురుగు నీరు సరిగ్గా పారడం లేదు. మురికి నీరంతా ఒకే చోట నిలిచిపోవడంతో ఇండ్లలోకి దుర్వాన వస్తుండడంతో పాటు దోమల బెడద ఎక్కువై రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచుల పదవీ కాలం పూర్తి కావడంతో గ్రామాన్ని పట్టించుకునే వారు లేకుండా పోయారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రత్యేక అధికారి, కార్యదర్శి ఉన్నా తమ సమస్యలు పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. చివరకు తమ ఇండ్ల ముందర మురికి కాలువలు ఎవరికి వారే శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని మండి పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మురికి కాలువలను శుభ్రం చేయించి, తమ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

**మోర్లు నిండి కంపు వాసన కొడుతున్నది..**



మా గల్లీల ఆరు నెలల సంది మోర్లు తీస్తలేరు. మోర్లు నిండి కంపు వాసన కొడుతున్నది. దీంతోని ఇంట్ల ఉండలేక పోతున్నం. దోమలు బాగ ఉన్నయి. గ్రామ పంచాయతీ సార్లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకుంటలేరు. దోమలు కరిచి దవఖాన పాలవుతున్నం.

–కటికె రాజు, గ్రామస్తుడు, బిచ్కుంద

## అంబులెన్సులో మహిళ ప్రసవం

•సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఈఎంటీ



అంబులెన్సులో ప్రసవించిన మహిళ

రామారెడ్డి (సదాశివనగర్), 23 ఫిబ్రవరి : సదాశివనగర్ మండలం వజ్జెపల్లి తండా గ్రామానికి చెందిన నినావత్ లలితకు పురిటి నొప్పులు రావడంతో ఆమెను దవాఖానకు తీసుకెళ్లడానికి గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త సంగీత 108 అంబులెన్స్‌కు కాల్ చేసి కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. సదాశివనగర్ శివారుప్రాంతంలో అంబులెన్స్ ఆపి క్రిటికల్ బ్రిడ్జ్ ప్రజెంటేషన్ కావడంతో ప్రసవం చేయడానికి ఎక్కువ సమయం పట్టింది. దీంతో పుట్టబోయే బిడ్డకు ఊపిరి ఆడట్లేదని గమనించిన ఈఎంటీ కమలాకర్ సీపీఆర్ చేశారు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డను ఏరియా దవాఖానలో చేర్చారు. లలిత కుటుంబ సభ్యులు ఈఎంటీ, పైలట్ మహేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ముగిసిన పీఎం శ్రీ విహారయాత్రలు




హైదరాబాద్ నెహ్రూ జూపార్క్ వద్ద ఉప్పల్‌వాయి గురుకుల విద్యార్థులు

రామారెడ్డి, ఫిబ్రవరి 23 : పీఎం శ్రీ పథకం రెండో విడుతలో భాగంగా ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలకు చెందిన 5,6,7వ తరగతి విద్యార్థులు శనివారం హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్‌కు విహారయాత్రకు వెళ్లినట్లు ప్రిన్సిపాల్ శివరాం ఆదివారం తెలిపారు. ఇంతటితో ఈ పథకంలో భాగంగా విహారయాత్రలు ముగిశాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

## ఇంటికి చేరిన తల్లీపిల్లలు



అదృశ్యమైన తల్లీపిల్లలను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 23: తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన చెవిటి రేవతి, కుమారుడు రిత్విక్, కూతురు రియాన్ని క్షేమంగా ఇంటికి చేరినట్లు స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19వ తేదీన రేవతి కుటుంబ కలహాలతో భర్తతో గొడవ పడింది. 20వ తేదీన పిల్లలతో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయింది. బంధువుల ఇంటికి వెళ్లిన రేవతి పిల్లలతో కలిసి తిరిగి క్షేమంగా ఆదివారం వచ్చింది. రేవతి పిల్లలను భర్తకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

గాంధారి, ఫిబ్రవరి 23: విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని గాంధారి ఏకలవ్య మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్ చంద్రసెర్వీ అన్నారు. మండల కేంద్రంలోని ఈఎంఆర్ఎస్ పాఠశాలలో మేరా యువభారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో క్లస్టర్ ఆఫ్ బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలతో శారీరకంగా దృఢంగా మారుతారన్నారు. అనంతరం నెహ్రూ యువ కేంద్ర వలంటీర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ యువతకు ఆటలపై ఆసక్తి పెంపొందించి వారిని ఫిట్‌గా తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీంట్లో భాగంగా గ్రామీణ స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, పరుగు పందెం తదితర పోటీలు నిర్వహించి, అందులో రాణించిన వారిని జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తున్నామని తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.



గాంధారి ఈఎంఆర్ఎస్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సురేశ్ చంద్రసెర్వీ

## వాహనాల తనిఖీ

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 23: తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామం వద్ద ఆదివారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు పరిశీలించి, వెంటనే చెల్లించాలని సూచించారు. పెండింగ్ చలాన్లు చెల్లించకుంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోని వాహనదారులకు జరిమానా విధించినట్లు ఏఎస్సై కొండల్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

## జడ్పీమాజీ చైర్మన్‌ను కలిసిన అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు



మహ్మద్‌నగర్‌లో జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజును శాలువాతో సన్మానిస్తున్న అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 23 : మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం ఉమ్మడి జిల్లాల జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజును మహ్మద్‌నగర్ మండల అంబేద్కర్ యవజన సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా దఫేదార్ రాజు మాట్లాడుతూ తమ నూతన మండలంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఎళ్లవేళలా, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. మహ్మద్‌నగర్ మండల అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు ఉన్నారు.

## గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీలో ముగిసిన క్రషింగ్



మాగి గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ ముగింపు సందర్భంగా పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న జనరల్ మేనేజర్ రాజబాబు

నిజాంసాగర్, ఫిబ్రవరి 23 : మండలంలోని మాగి గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీలో 2024–25 సీజన్ క్రషింగ్ ఆదివారంతో ముగిసినట్లు కర్మాగారం వైస్ చైర్మన్ వేణుగోపాలరావు తెలిపారు. ఈ సీజన్ క్రషింగ్‌ను నవంబర్‌లో ప్రారంభించగా, ఆదివారం వరకు 3,65,279 మెట్రిక్ టన్నుల చెరుకును క్రషింగ్ చేశామన్నారు. క్రషింగ్ ముగింపు సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రాజబాబు, కేన్ జనరల్ మేనేజర్ వెంగళ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుగుణ, భూషణరావు, శ్యాం, అధికారులు, ఫ్యాక్టరీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.